క్లుప్తంగా

గ్రంథాలయంలో చిన్నారులకు ఆటల పోటీలు



పోటీలో పాల్గొన్న చిన్నారులు

డుంబ్రిగుడ: వేసవి సెలవుల నేపథ్యంలో మండల కేంద్రంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా శాఖ గ్రంథాలయంలో మంగళవారం మ్యూజికల్ చైర్ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారి సునీత ఆధ్వర్యంలో ఈ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటలతో చిన్నారులు మానసికంగా, ఆరోగ్యంగా, ధృడంగా ఉండేందుకు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల వివధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

ప్రజా సమస్యలపై పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి పోతురాజు

చింతపల్లి: మండలంలోని చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని బొర్రి గ్రామంలో సీపీఐ నాయకుల సమావేశం మంగళవారం జరిగింది. కార్యక్రమానికి పార్టీ మండల కార్యదర్శి పోతురాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారానికి పార్టీ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. ప్రజా సమస్యలపై పార్టీ తరఫున పోరాటం చేసేందుకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో భాగంగా పార్టీ మండల శాఖ కార్యదర్శిగా పోత్తూరు చిన్నారావును ఎన్నుకున్నారు. నాయకులు కుజ్జన్న, సుబ్బారావు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం పరిశీలన



చింతపల్లిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి: మండల కేంద్రంలో జరుగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను తహసీల్దార్ రామకృష్ణ పరిశీలించారు. స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించి, టెన్త్ హిందీ పరీక్షను పర్యవేక్షించారు. ఈ పరీక్షకు మండల వ్యాప్తంగా 46 మందికి గాను 12 మంది విద్యార్థులు హాజరయ్యారు. మండలంలో జరిగిన టెన్త్ హిందీ పరీక్షకు జిల్లా పరిషత్ పాఠశాలలో 20 మందికి ఏడుగురు, బాలురు ఆశ్రమంలో 9 మందికి ఒక్కరు, బాలికల ఆశ్రమ పాఠశాలలో 17 మందికి నలుగురు మాత్రమే హాజరుకావడంపై వివరణ ఇవ్వాలని సంబంధిత పాఠశాలల హెచ్ఎంలకు తహసీల్దార్ ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవో ప్రసాద్, హెచ్ఎం కొండలరావు తదితరులున్నారు.

భారీ అన్నసమారాధన



అన్న సమారాధనలో భక్తులు

అరకులోయటౌన్: అరకులోయలో ఇటీవల జరిగిన వేంకటేశ్వర కల్యాణమహోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం వెంకటేశ్వర ఆలయంలో భారీ అన్న సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యులు బాలకృష్ణ, రంగరాజు, కృష్ణారావు, బొంజుబాబు, చందు, పైడిరాజు, రంగ, సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.

అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలపై వినతి



సీడీపీవో సుధకు వినతిపత్రం ఇస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

అడ్డతీగల: గొందోలు, సరంపేట గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాలను త్వరితగతిన పూర్తి చేయించాలని జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ నేతలు ఐసీడీఎస్ సీడీపీవో వై.సుధకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సొంత భవనాలు లేక సిబ్బంది, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. భవనాలను త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సీడీపీవో సుధను కోరారు. రమణ, నవాజ్, గ్రామస్తులు తదితరులున్నారు.

సా..గుతున్న పనులు

సచివాలయ భవనాల నిర్మాణం నత్తనడకన జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన **తరువాత వాటి నిర్మాణ పనులు దాదాపుగా నిలిచిపో**యాయి. వసతి సమస్యతో సిబ్బంది సతమతమ**వుతున్నారు. వాటిని పూర్తి చేయకపోవడంతో సచివాల**య సిబ్బంది విధులు నిర్వహించడం కష్టంగా **మారింది. సచివాలయాల భవనాల పనులు వెంటనే** పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



గూడెంకొత్తవీధి: ప్రజలకు చెంతకు ప్రభుత్వ సేవలందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన హయాంలో గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు నేరుగా ప్రభుత్వ పథకాలు, ఇతరత్రా సేవలన్నీ అందేలా చూశారు. ఇందుకోసం గ్రామ వలంటీర్ వ్యవస్థను ఏర్పాటుచేశారు. కోట్లాది రూపాయల నిధులతో గ్రామ సచివాలయ భవనాలను నిర్మించారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు అన్ని రకాల సేవలు అందేవి. గ్రామ సచివాలయాలు సేవా నిలయాలుగా ఉండేవి. ఈ మేరకు కొన్ని చోట్ల పూర్తిస్థాయిలో గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలు జరగ్గా మరికొన్ని ప్రాంతాల్లో నిర్మాణ దశకు



ఆర్.వి.నగర్‌లో అసంపూర్తిగా సచివాలయ భవనం



గూడెం కొత్తవీధిలో నిలిచిపోయిన సచివాలయ భవనం

చేరాయి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులన్నీ నిలిచిపోయాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థనే విస్మరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదైనా గ్రామ సచివాలయ భవనాల నిర్మాణంపై కన్నెత్తి చూడడం లేదు. దీంతో చాలా చోట్ల పంచాయతీ కార్యాలయాలు, ఇతర శాఖల భవనాల్లోనే పనులు జరుగుతుండడంతో వసతి సమస్యతో సిబ్బంది సతమతమవుతున్నారు. గ్రామ సచివాలయాల పనులు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల భవనాలు సరిగ్గా లేకపోవడంతో సచివాలయ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మండలానికి మొత్తం 18 సచివాలయ భవనాలు మంజూరయ్యాయి. వాటిలో సగం మాత్రమే పూర్తయ్యాయి. గూడెంకొత్తవీధి మండల కేంద్రంలోనే సచివాలయ భవనం పూర్తి కాలేదు. దీంతో పాటు ఆర్.వి.నగర్, దుప్పులవాడ, గాలికొండ, మొండిగెడ్డ, ఏబులం, దేవరాపల్లి, జెర్రెలలో గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలు జరగలేదు. వాటిని పూర్తి చేసేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైతు భరోసా కేంద్రాలది అదే పరిస్థితి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వ సేవలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడేవి. ఇందులో భాగంగా మండలానికి 16 రైతు భరోసా కేంద్రాలు మంజూరయ్యాయి. ఇందులో కొన్ని పూర్తికాగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. మారుమూల పంచాయతీల్లో భవన నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదు. దీని మూలంగా సీజన్‌లో వచ్చిన విత్తన నిల్వలను ఉంచేందుకు వ్యవసాయ సిబ్బందికి ఇబ్బంది కలుగుతుంది.

త్వరితగతిన పూర్తి చేయాలి



సచివాలయాలను వెంటనే పూర్తి చేయాలి. కూటమి ప్రభుత్వం గ్రామ సచివాలయ భవన నిర్మాణంలో తాత్సారం చేస్తోంది. దీని మూలంగా ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కాలయాపన చేయడం మినహా ఇంత వరకు ఈ ప్రభుత్వం చేసిందేమి లేదు. అధికారులు దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలి.

– అరుణ్, గూడెంకొత్తవీధి

కలెక్టర్ దృష్టిలో ఉంచాం



సచివాలయాల పూర్తి చేయడానికి వీలుగా నిధులు లేని విషయాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లాం. వాటి వివరాలను కలెక్టర్‌కు వివరించాం. త్వరలో నిధులు వచ్చే అవకాశం ఉంది. నిర్మాణాలను త్వరిగతిన పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– జ్యోతిబాబు, పీఆర్ జేఈ

లేబర్ కోడ్ రద్దు చేయాలని డిమాండ్



జీకే వీధిలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

డుంబ్రిగుడ: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూలై 9న చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు పోతురాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రం జాతీయ రహదారి గుంటసీమ జంక్షన్ వద్ద ఆశ క్యాకర్తలతో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో జాతీయ రహదారి వద్ద నిరసన చేస్తున్న ఆశా కార్యకర్తలు

గూడెంకొత్తవీధి: మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా మార్చాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ వర్కర్లు మంగళవారం రింతాడ సచివాలయం ఎదుట ఆందోళన చేశారు. లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం విధిగా అన్ని మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్‌గా మార్చాలన్నారు. దీనిపై ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కేంద్రం తీసుకున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సోమలి అప్పలనరస, దయ వెంకటి, మీనాక్షి కుమారి తదితరులు పాల్గొన్నారు

వైభవంగా గ్రామదేవతల వేడుకలు

- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
- తరలివచ్చిన భక్తులు
- సందడిగా గ్రామాలు



నడింవీధిలో పూజలు చేస్తున్న భక్తులు



మారేడుమిల్లిలో భక్తులతో కలిసి పూజలు చేస్తున్న ఎంపీడీవో విశ్వనాథ్ దంపతులు

హుకుంపేట: సూకురు నడింవీధి గ్రామంలో గ్రామ దేవత పండగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. గిరిజన సంప్రదాయం ప్రకారం రహదారిపై పందిరి వేశారు. ఉదయం నుంచి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు సమర్పించుకున్నారు. సర్పంచ్ దనసాని సత్యవతి, భక్తులతో కలిసి అమ్మవారికి పూజలు చేశారు. నాయకులు మురళి, పోతురాజు నాయుడు, ఉమామహేశ్వరరావు, రమేష్, బాలమజ్జి పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన గంగాలమ్మ జాతర

రంపచోడవరం: మారేడుమిల్లి గ్రామ దేవత కనకవర్షిణి గంగాలమ్మ అమ్మవారి జాతర మంగళవారం ప్రారంభమైంది. మారేడుమిల్లి ఎంపీడీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆరు రోజులు పాటు జరిగే అమ్మవారి ఉత్సవాలకు వేలాదిగా భక్తులు రానున్నట్టు ఉత్సవ, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేడుకలో భాగంగా ఈనెల 23న అమ్మవారికి కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు

- జియో సెల్ టవర్‌కు కానరాని ప్రహరీ
- చెంతనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్
- మృత్యువాతకు గురైన మూగజీవాలు
- పొంచి ఉన్న ప్రమాదం
- కర్రలు, తీగలతో కంచె ఏర్పాటు
- గ్రామస్తుల శ్రమదానం



కంచెను ఏర్పాటు చేస్తున్న గ్రామస్తులు

గూడెంకొత్తవీధి: మండలంలోని దేవరాపల్లి పంచాయతీ మంగళపాలెంలో జియో సెల్ టవర్ చుట్టూ రక్షణ గోడను ఏర్పాటు చేయకపోవడంతో గ్రామస్తులంతా కలిసి మంగళవారం శ్రమదానం ద్వారా కర్రలతో కంచెను ఏర్పాటు చేశారు. టవర్‌కు విద్యుత్ సరఫరా నిమిత్తం ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఇప్పటి వరకు విద్యుత్‌షాక్‌కు గురై ఐదు మేకలు చనిపోయాయి. మేతకు వెళ్లి తిరిగి వస్తున్న పది పశువులు కూడా విద్యుత్‌షాక్‌కు గురి కావలసి ఉండగా దానిని గమనించిన పశువుల కాపరి వెంటనే సరఫరాను నిలిపివేశారు. దీంతో ప్రమాదం నుంచి పశువులు బయటపడ్డాయి. పశువులకు ప్రమాదం తప్పదని భావించిన స్థానికులు శ్రమదానంతో టవర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేశారు. సంస్థ వెంటనే రక్షణ గోడ నిర్మించాలని కోరుతున్నారు. ఇక్కడున్న సెల్ టవర్‌కు చెంతన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుందని, ప్రమాదం పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు. ఎటువంటి ప్రహరీ లేకపోవడంతో పశువులు టవర్ వద్ద మేతకు వెళ్లి విద్యుత్ షాక్‌తో మృత్యువాతకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, సెల్‌టవర్ వద్ద రక్షణ ప్రహరీ నిర్మించాలని వారు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



వాతంగిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ చిన్నబాబు

రాజవొమ్మంగి: సైబర్ వలలో పడి మోసపోవద్దని మండలంలోని జడ్డంగి ఎస్ఐ చిన్నబాబు గిరిజన ప్రజలకు సూచించారు. మండలంలోని వాతంగి గ్రామంలో ఆయన మంగళవారం పర్యటించారు. స్థానికులతో సమావేశం ఏర్పాటు చేసి పలు జాగ్రత్తలు తెలిపారు. గంజాయి అక్రమ రవాణా విషయంలో ఎవరికి సహకరించవద్దన్నారు. సారా వల్ల ఆరోగ్యం పూర్తిగా పాడైపోతుందని వివరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అడవి జంతువుల వేటలో కరెంటు తీగలు అమర్చడం పెద్ద నేరమని, అటువంటి ఉదంతాలు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామంలో సమస్యలు ఏవైనా ఉంటే తనకు తెలియజేస్తే ఉన్నతాధికారులు దృష్టిక తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సీఆర్ఎఫ్ బలగాలు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



వర్మీకంపోస్టు యూనిట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. సిబ్బంది సచివాలయాలకు హాజరవుతున్న దానిపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నామన్నారు. మండలంలోని సంకాడ సచివాలయాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుపై వివరాలు అడిగారు.

సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంను పరిశీలించారు. గ్రామాల్లో చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. రానున్నది వర్షాకాలం కావడంతో అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రకృతి సాగుతో మేలు



సంగులోయలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

జి.మాడుగుల: రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయం చేయాలని రైతు సాధికార సంస్థ ఎం.నిట్టాపుట్టు ఇన్‌చార్జి మేడా ప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని పెద్దలువ్వాసింగి పంచాయతీ సంగులోయ గ్రామంలో మంగళవారం గ్రామైక్య సంఘాలు, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌చార్జి ప్రసాద్ మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగంతో ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. హైబ్రిడ్ విత్తనాల వల్ల భూసారం తగ్గుతుందన్నారు. ప్రకృతి సిద్ధంగా తయారుచేసిన ఘన, ద్రవ జీవామృతాలను వినియోగించాలన్నారు. తొలకరి వర్షాల కంటే ముందు దుక్కిలో 25 నుంచి 30 రకాల జాతుల విత్తనాలు ఎకరానికి కనీసం 12 నుంచి 15 కిలోల జల్లుకొవాలని సూచించారు. సర్పంచ్ సత్యనారాయణ, ఐసీఆర్‌పీలు కొండబాబు, బొంజుబాబు, సురేష్, ఢిల్లీబాబు, లక్ష్మయ్య, సత్య, మచ్చమ్మ, ఇందుమతి, రైతులు పాల్గొన్నారు

ఎట్టకేలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

జాజిపాలెంలో విద్యుత్ సరఫరాకు అధికారుల చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



జాజిపాలెంలో విద్యుత్ లైన్‌ను సరిచేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

అడ్డతీగల: మండలంలోని జాజిపాలెంలో ఎట్టకేలకు విద్యుత్ సరఫరా జరిగింది. గ్రామంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. విద్యుత్ లేకపోవడంతో నీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు నాలుగు రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విషయాన్ని తెలియజేసింది. ఈ సందర్భంగా ఈనెల 20వ తేదీన 'సాక్షి'లో 'విద్యుత్ కోతలు..తాగునీటికి ఇక్కట్లు' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై విద్యుత్ శాఖాధికారులు స్పందించారు. అధికారులు గ్రామంలో మంగళవారం పర్యటించి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేయించారు. శని, ఆదివారాల్లో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా మండలంలోని డి.కొత్తూరు సెంటర్ నుంచి తిరుమలవాడ, జాజిపాలెం, దాకోడు వరకు విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగిపడి లైన్లు తెగిపడ్డాయని ట్రాన్స్‌కో అడ్డతీగల మండల జేఈ సుదర్శన్ చెప్పారు. ఈ కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. లైన్లు తెగిపడిన చోట సిబ్బందితో కలిసి కొత్త లైన్లు వేయించి ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించామన్నారు. దీంతో పాటు డి.రామవరం సెంటర్ నుంచి వీరంపాలెం విద్యుత్ స్తంభాలు విరిగిపడి లైన్లు దెబ్బతిన్నాయని, వీటిని సరిచేసినట్టు ఆయన చెప్పారు.

శిరమయ్యకు ఘన నివాళి



శిరమయ్య స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ కారం లక్ష్మి

వి.ఆర్.పురం: మండలంలోని చిన్నమట్టపల్లి గ్రామంలో సీపీఎం నాయకుడు, మాజీ ఎంపీపీ కారం శిరమయ్య వర్ధంతి సభ మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కారం లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యుడు సోయం చినబాబు తదితరులు శిరమయ్య స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ గిరిజనుల సమస్యలపై శిరమయ్య అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. పోలవరం నిర్వాసితులకు మెరుగైన పరిహారం, పునరావాసం కల్పించాలన్నారు. పార్టీ మండల కార్యదర్శి సంతోష్ కుమార్, ఎంపీటీసీ సభ్యుడు పూనెం ప్రదీప్ కుమార్, నాయకులు సుందరయ్య, నాగిరెడ్డి, బాబూరావు, తాతబాబు, శ్రీనివాసురావు, నాగమ్మ, శిరమయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు



చింతూరు ఐటీడీఏ ఎదుట నిరాహార దీక్ష చేస్తున్న ఆదివాసీ జేఏసీ నాయకులు

చింతూరు: ఆదివాసీలకు మేలు చేకూర్చే జీవో నంబర్–3ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని ఆదివాసీ జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ డిమాండ్ చేశారు. ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ఐటీడీఏ ఎదుట నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో భాగంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టాన్ని ప్రకటించి ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరారు. ఆదివాసీ మేలుకో.. హక్కులు కాపాడుకో.. అనే నినాదంతో యువతరం ముందుకు సాగాలని, ప్రభుత్వం గిరిజన ప్రజా ప్రతినిధులతో ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు సాయిబాబు, మహేంద్ర, దేశమ్మ, మీనాక్షి, బలరాం, ప్రవీణ్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.